క్లుప్తంగా

విద్యార్థులకు క్విజ్‌పోటీలు

అడ్డాకుల: మూసాపేట మండలం తుంకినీపూర్ పాఠశాలలో విద్యార్థులకు శనివారం బాలసభ నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించడంతో పాటు పాటలు, నృత్యాల పోటీలను ఏర్పాటు చేశారు. అదే విధంగా విద్యార్థులతో నీతి కథలను చెప్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మామిళ్ల లక్ష్మణ్‌గౌడ్, ఉపాధ్యాయుడు కుర్మయ్య ఉన్నారు.

అనాథ పిల్లలను ఆదుకోవాలి

జడ్చర్ల: అనాథ పిల్లలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ జంగయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వినతి పత్రం సమర్పించారు. అనాథ పిల్లలకు ప్రత్యేకంగా కార్యక్రమాలను అమలు చేయాలని, విద్య, వసతి, వైద్యం, తదితర వనరులను అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ వినోద్, సురేష్, యాదయ్య పాల్గొన్నారు.

సర్పంచ్, కార్యదర్శుల సస్పెండ్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): గ్రామ పంచాయతీ నిధులను దుర్వినియోగం పాల్పడిన అన్నాసాగర్ గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శిలను జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ సస్పెండ్ చేశారు. 14 లక్షల గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం చేసినందుకు గాను జిల్లాలోని భూత్పూర్ మండలం అన్నాసాగర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ నీలిమను సర్పంచ్‌ను చేశారు. అన్నాసాగర్ గతంలో కార్యదర్శి ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి సైతం సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

దళిత, గిరిజన సభను విజయవంతం చేయండి

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు దళిత, గిరిజన ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యదర్శి సీజే బెనహర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సభలో రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మానిక్‌రావ్ ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, సీఎల్‌పీ నాయకుడు మల్లు భట్టివిక్రమార్క, కాంగ్రెస్ ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రీతంతోపాటు ఇతర సీనియర్ నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు.ఈ సభలో జిల్లాలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

భార్య కనిపించడం లేదని భర్త ఫిర్యాదు

అడ్డాకుల: ఇంటి వద్ద ఉన్న తన భార్య తాను బయటికి వెళ్లగానే ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయిందని భర్త ఫిర్యాదు చేసినట్లు మూసాపేట ఎస్‌ఐ నరేష్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మండలంలోని వేములకి చెందిన మాల రాములుకు రెండేళ్ల క్రితం నర్వ మండలం మంతన్‌కోడ్‌కి చెందిన వెంకటమ్మ అలియాస్ అనిత(28)తో వివాహమైంది. భర్త రాములు వ్యవసాయం చేస్తుండగా అనిత మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా పని చేసేది. ఇదిలా ఉండగా శుక్రవారం ఉదయం రాములు ట్రాక్టర్‌లో కట్టెలు వేసుకుని దుప్పల్లికి వెళ్లాడు. తర్వాత కొంత సేపటికి ఇంట్లో ఎవరికి చెప్పకుండా అనిత ఎక్కడికో వెళ్లిపోయింది. కాసేపటికి ఇంట్లో ఆమె కనిపించకపోవడంతో అత్త లక్ష్మమ్మ వెంటనే తన కుమారుడికి ఫోన్ చేసి చెప్పింది. కుటుంబ సభ్యులతో పాటు బంధువులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం తన భార్య కనిపించడం లేదని భర్త రాములు మూసాపేట ఠాణాలో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మృతదేహంతో ఇంటి ఎదుట ఆందోళన

మహబూబ్‌నగర్ క్రైం: మహబూబ్‌నగర్ మండల పరిధిలోని గాజులపేటలో మంజుల మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం మృతురాలి మృతదేహంతో మజ్జిగ మల్లేష్ ఇంటి ఎదుట కుటుంబసభ్యులు ధర్నా నిర్వహించారు. శుక్రవారం మంజుల ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం విధితమే. అయితే బాధిత కుటుంబ సభ్యులు ఆమె మృతి కారకులు అయిన మల్లేష్, శేఖర్‌లపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు మృతురాలి పిల్లలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన స్థలానికి రూరల్ పోలీసులు చేరుకుని ఆందోళనకారులకు సర్దిచెప్పి ధర్నా విరమింపజేశారు.

'కక్ష పూరితంగానే సస్పెండ్'

భూత్పూర్: బీఆర్‌ఎస్ నుంచి బీజేపీ మారడాన్ని దృష్టిలో పెట్టుకొని, ఉద్దేశపూర్వకంగా కక్ష కట్టి సస్పెండ్ చేయించారని అన్నాసాగర్ సర్పంచ్ కరెంట్ నీలిమ ఆరోపించారు. శ్మశాన వాటిక, డంపింగ్ యార్డు పనుల నిర్మాణం చేపట్టామని, ఎంబీలు సైతం చేయించామని, తాను ఎలాంటి అవనీతి పాల్పడలేదని సర్పంచ్ అన్నారు. నా భర్త కరెంట్ నర్సింహులు శ్రీనిధి నిధులు కాజేశారనే ఆరోపణలతో జైలుకు పంపారని, నాపై నిధుల స్వాహా చేసినట్లు నన్ను సస్పెండ్ చేయడం తగదని, త్వరలోనే కోర్టుకు వెళ్తున్నట్లు ఆమె అన్నారు. బీఆర్‌ఎస్‌లో దాదాపు ఏడాదిన్నర తర్వాత అవనీతి గుర్తుకొచ్చిందా అని, పార్టీ మారడంతోనే ఉద్దేశ పూర్వకంగా సస్పెండ్ చేశారని సర్పంచ్ ఆరోపించారు.

అక్రమాల నివారణకే సామాజిక తనిఖీ

డీఆర్‌డీఓ యాదయ్య



మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న ఏపీడీ జకియా సుల్తానా

మహబూబ్‌నగర్ రూరల్: ఉపాధిహామీ పథకంలో లోటుపాట్లను నియంత్రించేందుకే సామాజిక తనిఖీ నిర్వహిస్తామని డీఆర్‌డీఓ యాదయ్య అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా మండలంలోని 26 గ్రామాల్లో వారం రోజులుగా నిర్వహించిన 12వ విడత సోషల్ ఆడిట్‌పై శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని గ్రామాల్లో 13 పరిశీలన బృందాలు 2019 డిసెంబర్ 1వ తేదీ నుంచి 2022 మార్చి 31వ తేదీ వరకు నిర్వహించిన హరితహారం, రోడ్ల నిర్మాణం, కందకాలు తవ్వడం, రాళ్ల కట్టలు వేయడం తదితర పనులను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఆయా గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేసి ఉపాధి కూలీలు, ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ మాట్లాడుతూ అన్నీ గ్రామాల్లో ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. టీఏలు, ఈసీల తప్పిదాలతో పొరపాట్లు జరిగాయని, తిరిగి పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించారు. ఉపాధి పనుల నిర్వహణలో సర్పంచ్‌లు, కార్యదర్శులు, టీఏలు, ఈసీలు సమన్వయంతో పని చేసి కూలీలకు పని కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ పనులపై సమీక్ష నిర్వహించారు. సామాజిక తనిఖీ బృందం ఉపాధిహామీ పనుల వివరాలను అధికారుల దృష్టికి తెచ్చి పనులు జరిగిన తీరును, నిధుల కేటాయింపును ప్రజావేదికలో వెల్లడించారు. కార్యక్రమంలో ఏపీడీ జకియా సుల్తానా, ఎంపీపీ సుధాశ్రీ, రైతుబంధు మండల అధ్యక్షుడు మల్లు దేవేందర్‌రెడ్డి, ఎంపీడీఓ జ్యోతి, ఏపీఓ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే సి.లక్ష్మారెడ్డి


ఇంటి స్థలం పట్టాలు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం దగ్గర ప్రభుత్వ జీఓ 58 కింద నిరుపేద కుటుంబాలకు సంబంధించి అర్హులైన 105 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాల పట్టాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద ఆర్థిక సహాయం అందిస్తుందని, డబుల్ బెడ్రూం ఇళ్లు, పింఛన్లు, తదితర అనేక సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని వివరించారు.

సీసీరోడ్లకు శంకుస్థాపన..

శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆలయం ఎదుట సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.20 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు, పనులను నాణ్యతగా సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ సారిక, కమిషనర్ షేక్ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల పట్ల వివక్ష చూపొద్దు


బహుమతి అందజేస్తున్న సీడీపీఓ రాజేశ్వరి

మహబూబ్‌నగర్ రూరల్: ఆడపిల్లల పట్ల వివక్ష చూపకుండా బాలురతో సమానంగా బాలికల విద్యను కూడా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని మహబూబ్‌నగర్ అర్బన్ సీడీపీఓ కె.రాజేశ్వరి అన్నారు. జాతీయ బాలికా వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం పట్టణంలోని బండ్లగేరిలో గల కమ్యూనిటీహాల్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పద్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసీమ్ సుల్తానా, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వెంకటేష్, అంగన్‌వాడీ టీచర్లు నీరజ, గాయత్రి పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి


ఆశిరెడ్డిపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి

గండేడ్: కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ఆశిరెడ్డిపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. మండలంలో అంచన్‌పల్లి, ఆశిరెడ్డిపల్లి, జానంపల్లి శిబిరాల్లో 172 మంది పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ బాబురావు, వైస్ ఎంపీపీ ఈశ్వరయ్య, ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి, తహసీల్దార్ జ్యోతి, మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్, సర్పంచ్ గోపాల్ పాల్గొన్నారు.

భూత్పూర్: రెండవ విడత కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్ అన్నారు. శనివారం మున్సిపాలిటీలోని రెండవ వార్డులో కంటి వెలుగు కార్యక్రమానికి హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నారాయణ గౌడ్, మాజీ జెడ్పీటీసీ చంద్రమౌళి, కమిషనర్ నజీబ్, మేనేజర్ అశోక్‌రెడ్డి ఉన్నారు.

నవాబుపేట: మండలంలో కంటి వెలుగులో 207 మందికి పరీక్షలు చేసినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని షాసాబ్‌గుట్టలోని మదర్సా దారుల్ ఉలుమ్ అరెబియా లిన్‌బనాత్‌లో శనివారం ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో మెడికల్ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధ బాలికలకు వివిధ వైద్య పరీక్షలు చేశారు. బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం గౌసియాబేగం, ఫార్మాసిస్ట్ మమత, దారుల్ ఉలుమ్ మదర్సా డైరెక్టర్ ఖాజా ఫైజొద్దీన్ పాల్గొన్నారు.

వైభవంగా చండీహోమం

జడ్చర్ల టౌన్: మండలంలోని దేవునిగుట్టతండా పంచాయతీ వద్ద ఉన్న శ్రీగిరిక్షేత్రం అష్టలక్ష్మి ఆలయంలో అమావాస్యను పురస్కరించుకుని శనివారం లోకకల్యాణార్థం చండీహోమం నిర్వహించారు. ఈ మేరకు ఆచార్య కృష్ణస్వామి నేతృత్వంలో అమ్మవారికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం జరిపించి హోమం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పెద్దాయపల్లిలో భూమిపూజ

బాలానగర్: జాతీయ రహదారి నుంచి గ్రామానికి వెళ్లే పెద్దయాపల్లి ముఖ్య కూడలిలో గ్రామ ముఖద్వారం కమాన్ నిర్మాణానికి సర్పంచ్ శంకరప్ప, ఎంపీటీసీ స్నేహలత నాగేందర్‌లతో కలిసి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో భాగంగా జాతీయ రహదారిపై వెళ్తున్న వ్యక్తులు తమ గ్రామాన్ని గుర్తించే విధంగా ముఖద్వారం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ఎంపీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మయ్య, నర్సింలు, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామకొండపై పూజలు

కోయిల్‌కొండ: మండలంలో ప్రసిద్ధి చెందిన శ్రీరామకొండ క్షేత్రంలో శనివారం పుష్య మాస అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు రాఘవేందర్‌రావు తెలిపారు. ఉదయం స్వామివారిని ప్రత్యేక పూలతో అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించినట్లు ఆయన తెలిపారు.

25న అమవీరుల స్మారక వాలీబాల్ టోర్నీ

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని రామయ్యబౌలీలో ఈనెల 25వ తేదీన తెలంగాణ అమరవీరుల స్మారక జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్ ఎండీ మతీన్‌ఉర్ రహెమాన్ తెలిపారు. శనివారం రామయ్యబౌలీ వాలీబాల్ మైదానంలో వాలీబాల్ టోర్నీ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఎంట్రీఫీజు లేదని, టోర్నీలో విజేత జట్టుకు రూ.15వేలు, ద్వితీయ జట్టుకు రూ.10వేలు, మూడోస్థానం జట్టుకు రూ.5వేలు నగదు పారితోషికం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాల కోసం 9985367313ను సంప్రదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి చెన్న వీరయ్య, శరత్‌బాబురెడ్డి, గులాం దస్తగీర్, మహ్మద్ ఖాజా హుస్సేన్ పాల్గొన్నారు.

జాబ్‌కార్డుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలి


కూలీల ఆధార్ అనుసంధానం చేస్తున్న టీఏలు

మహమ్మదాబాద్: జాతీయ ఉపాధిహామీలో పనిచేస్తున్న ఉపాధి కూలీలు వారి జాబ్‌కార్డును ఆధార్‌కు అనుసంధానం చేసుకోవాలని ఏపీఓ హరిచ్చంద్రుడు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం చిన్నాయపల్లిలో ఇలాంటి ప్రక్రియ చేపట్టారు. ఉమ్మడి మండల వ్యాప్తంగా 19వేల మంది కూలీల ఆధార్‌కార్డులను ప్రస్తుతం వారి జాబ్‌కార్డులకు అనుసంధానం లేనందున వాటిని అనుసంధానం చేసే ప్రక్రియ కొనసాగుతున్నట్లు ఆయన తెలిపారు. ఆయా గ్రామాల వారిగా టీఏలు కూలీల దగ్గరకు వెళ్లి వారి ఆధార్ జిరాక్స్ తీసుకుని అప్‌డేట్ చేస్తున్నట్లు తెలిపారు. గతంలో సంబంధిత ఎఫ్ఏ, టీఏల లాగిన్‌లో ఉన్నందున ప్రస్తుతం అలాంటి జాబితాను కేంద్ర ప్రభుత్వం ఎంపీడీఓ లాగిన్‌కు అనుసంధానం చేస్తున్నందున ఈ ప్రక్రియ చేపట్టినట్లు ,ప్రతీ ఉపాధి కూలీ ఆధార్ అనుసంధానం చేసుకోవాలని సూచించారు.

ఎస్సీ వర్గీకరణనే ధ్యేయం

మహబూబ్‌నగర్ రూరల్: మాదిగల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ఎస్సీ వర్గీకరణనే ధ్యేయంగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తున్నామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపోగు శ్రీనివాస్ అన్నారు. పాలకులకు మాదిగ, మాదిగ ఉప కులాల ప్రజల అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని అన్నారు. శనివారం స్థానిక టీఎన్జీఓ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన సమావేశంలో నాయకులు జయన్న, చెన్నయ్య, నాగరాజు, అనంతయ్య, చెన్నప్ప, నర్సిములు పాల్గొన్నారు.

శాట్ చైర్మన్‌ను కలిసిన డాక్టర్ రామలక్ష్మణ్

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఆంజనేయులుగౌడ్‌ను శనివారం సాంఘిక సంక్షేమ గురుకుల అధికారి డాక్టర్ రామలక్ష్మణ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారం, సంస్థ కార్యదర్శి రోనాల్డ్‌రోస్ ప్రోత్సాహంతో క్రీడా అకాడమీల్లో వస్తున్న ఫలితాలను చైర్మన్‌కు వివరించారు.

విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి

కోయిల్‌కొండ: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఏఎంఓ వెంకట్రామిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కనాయపల్లి, చంద్రాస్‌పల్లి, తిర్మలంపల్లిలలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగ్యానాయక్, విజయ్‌కుమార్, వందేశ్ పాల్గొన్నారు.

సకాలంలో చికిత్స చేయించాలి

అడ్డాకుల: మూగజీవాలు వ్యాధులకు గురైతే వెంటనే గుర్తించి వాటికి సకాలంలో చికిత్స చేయించాలని వెటర్నరీ ఏడీ డాక్టర్ రషీద్ సూచించారు. మూసాపేట మండలం జానంపేట పశువైద్య కేంద్రంలో శనివారం పశువులు, గేదేలకు వైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు డాక్టర్ మధుసూదన్ గర్భ నిర్ధారణ పరీక్షలు చేసి అవసరమైన వాటికి టీకాలు, మందులు వేశారు. 68 పశువులు, గేదెలకు నిర్ధారణ పరీక్షలు చేశారు. బలహీనంగా ఉన్న వాటి కోసం మినరల్ మిక్చర్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీటీసీలు ఆంజనేయులు, గోవర్ధన్‌సాగర్, భూత్పూర్ డాక్టర్ పి.మధుసూదన్, సిబ్బంది చంద్రమోహన్‌గౌడ్, నాయకులు అబ్దుల్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

మహమ్మదాబాద్: మండల పరిధిలోని జూలపల్లిలో శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు గుడిసెలు కాలిపోవడంతో వారికి డీసీసీబీ చైర్మన్ బి. మనోహర్‌రెడ్డి ఆర్థిక సహాయం అందించారు. వివరాల ప్రకారం.. వడ్డె వెంకట్రాములు, వడ్డె వెంకటమ్మ, వడ్డె రాములు పొలాల దగ్గర గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారు. శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు ఒక్క గుడిసెకు నిప్పు అంటుకుంది. అయితే ముగ్గురి గుడిసెలు దగ్గర దగ్గర ఉండటంతో వారి గుడిసెలు కూడా అంటుకున్నాయి. గుడిసెల్లో ఉన్న వంటసామగ్రి, దుస్తులు కాలి బూడిదయ్యాయి. దీంతో సర్పంచ్ కిరణ్ వారికి బియ్యం సహాయం చేయగా డీసీసీబీ చైర్మన్ ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. రైతుసమన్వయసమితి అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి, ఉపసర్పంచ్ రాజు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి


పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే ఆల

దేవరకద్ర: చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. శనివారం దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని వీరప్పయ్యస్వామి దేవస్థానం గ్రౌండ్‌లో దేవరకద్ర ప్రీమీయర్ లీగ్ క్రికెట్ టోర్నీని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నపూర్ణ, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు జట్టి నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ఎల్‌ఓసీలు, చెక్కుల అందజేత

మండలానికి సంబంధించి పలువురు లబ్ధిదారులకు ఎల్‌ఓసీలు, చెక్కులు, ఆర్థిక సహాయాలను ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి శనివారం అందజేశారు. మండలంలో జరిగిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడానికి వచ్చిన ఆయన పెద్దగోప్లాపూర్‌కు చెందిన నన్నెసాబ్‌కు నిమ్స్‌లో చికిత్స నిమిత్తం రూ. 2.50 లక్షల ఎల్‌ఓసీ అందజేశారు. అలాగే 19 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ సభ్యుడు అన్నపూర్ణ, నాయకులు జట్టి నర్సింహారెడ్డి, వెంకటేశ్, శ్రీకాంత్‌యాదవ్, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

త్రోబాల్ ఫెడరేషన్ కప్ పోటీలకు ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు: ఒరిస్సాలోని పూరిలో ఈనెల 23 నుంచి 25 వరకు జరిగే 34వ త్రోబాల్ ఫెడరేషన్ కప్ (జాతీయస్థాయి) పోటీలకు జిల్లాలోని భూత్పూర్‌కు చెందిన చెన్న కేశవులు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా శనివారం స్థానిక మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్‌లో జిల్లా త్రోబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనను సన్మానం చేసి టీ షర్టు అందజేశారు. కార్యక్రమంలో గ్రామర్ స్కూల్ ప్రిన్సిపాల్ శాంత, జిల్లా త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాదత్‌ఖాన్, అహ్మద్ హుస్సేన్, జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎండీ జియావుద్దీన్, త్రోబాల్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో అండగా..

- అనిరుధ్‌రెడ్డి సేవలు అభినందనీయమని ప్రశంసలు
- పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థికసాయం


అసోం ఐఐటీలో సీటుసాధించిన జ్యోతికి రూ.50 వేలు అందజేస్తున్న అనిరుధ్‌రెడ్డి

రాజాపూర్: ఆపదలో ఉన్న పేద ప్రజలతోపాటు విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకునేందుకు అభయమిస్తు వారికి అండగా ఉంటున్న అనిరుధుడి సేవలు అభినందనీయమని మండల ప్రజలు ప్రశంసిస్తున్నారు. మండల పరిధిలోని రంగారెడ్డిగూడకి చెందిన జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ఇతరుల సమస్యలను తమ సమస్యగా భావిస్తు వారికి అండగా నిలుస్తున్నారు. మొదట తన గ్రామంలో ఎవరైన చనిపోతే అంత్యక్రియలకు ఇబ్బందులు పడకూడదని బాధిత కుటుంబానికి తనవంతుగా ఆర్థికసాయం అందిస్తున్నారు. అంతేకాకుండ ఆడకూతుళ్ల వివాహాలకు, ఆలయాల నిర్మాణాలకు తన వంతు సహకారం అందిస్తు ప్రజల మన్ననలు పొందుతున్నారు. పేదవిద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిస్తే వారి చదువు ఆగకుండ అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారు. అనారోగ్యంపాలైన ఎందరికో ఆస్పత్రిలో చికిత్సలు చేయించి వారికి భరోసా నిచ్చారు. ఇటీవల కల్లేపల్లికి చెందిన జటావత్ జ్యోతి ఐఐటీ అస్సాంలో సీటు సాధించి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఆయన ఇంటికి వెళ్లి రూ.50 వేల నగదు అందజేశారు. అలాగే గ్రామంలో లక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సలవాలను సైతం తిరిగి పూర్వ వైభవం తెచ్చే విధంగా బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తు చుట్టుపక్కల గ్రామాల ప్రజల మన్ననలను పొందుతున్నారు.

అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకట్రావ్, అదనపు కలెక్టర్లు తేజస్ నందులాల్ పవర్, సీతారామరావు

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): రైతులకు, వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బందికి అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీ దిక్సూచిలా ఉందని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. శనివారం అదనపు కలెక్టర్లు తేజస్ నందులాల్ పవర్, సీతారామరావులతో కలిసి అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ డైరీ, టేబుల్ క్యాలెండర్, వాల్ క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా చైర్మన్, డీఏఓ బి.వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి మురళీధర్, కోశాధికారి సిద్దార్థ, కార్యవర్గ సభ్యులు రాజేందర్ అగర్వాల్, రాజేష్ ఖన్నా, ఇశ్రత్ సుల్తానా, మీన పాల్గొన్నారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వర్కర్స్ అసోసియేషన్ రూపొందించిన నూతన డైరీ, క్యాలెండర్లను శనివారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్, ఉపాధ్యక్షుడు సయ్యద్ అబ్దుల్ వహీద్‌షా పాల్గొన్నారు.

వెన్నాచేడ్ వాసికి అవార్డు

గండేడ్: మండల పరిధిలోని వెన్నాచేడ్ వాసికి విశిష్ట సేవలకు గాను జన కల్యాణ సేవా ధురీణ అవార్డు లభించింది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వెన్న ఈశ్వరప్ప ఎక్సైజ్ శాఖలో డీఎస్పీ హోదాలో ఉద్యోగం చేస్తూ వివేకానంద సేవా సంస్థ, లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగానే శనివారం కర్ణాటకలోని బీదర్‌లోని భూమిరెడ్డి కాలేజీలో జరిగినా సభా ప్రాంగణంలో ముఖ్య అతిథి బసవలింగ పట్టదేవరు అమృత హస్తములచే జన కల్యాణ సేవా ధురీణ అవార్డు ప్రధానం చేశారు.

క్లాస్‌మేట్ క్లబ్‌లో ఎవరెస్ట్ విద్యార్థుల ప్రతిభ

హన్వాడ: మహబూబ్‌నగర్ డివిజన్‌లో పరిధిలోని కోయిల్‌కొండ, హన్వాడ, మహబూబ్‌నగర్, మండలాల్లోని వివిధ పాఠశాలల విద్యార్థులకు జిల్లా కేంద్రంలో శనివారం ఆంగ్లపదజాల పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షల్లో ఎవరెస్ట్ టాలెంట్ స్కూల్ విద్యార్థులు అశ్విని, ఆర్.పావని ప్రతిభ కనబరిచి క్లాస్‌మేట్ క్లబ్‌లో ప్రశంసాపత్రాలను అందుకున్నారు. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ రాజేందర్‌జీ, ఉపాధ్యాయులు మహేష్, బాల్‌రాజు అభినందించారు.

గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలి

కోయిల్‌కొండ: మండలంలోని గార్లపహాడ్ పరిసర గ్రామాలను అనుసంధానం చేస్తూ నూతన మండలంగా ప్రకటించాలని జేఏసీ నాయకులు రామునాయక్, వెంకట్రామిరెడ్డిలు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కేశ్వాపూర్, పేర్కివీడు గ్రామాల ప్రజలతో నూతన మండల ఏర్పాటుపై సమావేశం నిర్వహించారు. గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని కేశ్వాపూర్ సర్పంచ్ మెగులయ్య, పేర్కివీడు సర్పంచ్ రాఘవేందర్‌రెడ్డిలతోపాటు ఆయా గ్రామాల ప్రజలు సంపూర్ణ మద్దతు పలికారని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు నవీన్ ఆంజనేయులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిగా పరిశీలించాలని వినతి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఈ ఏడాది మార్చిలో జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పరిశీలించాలని కోరుతూ టీపీఆర్‌టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షులు జి.హర్షవర్ధన్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రేను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలి

దేవరకద్ర: జీరో సర్వీసుతోనే ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి డిమాండ్ చేశారు. గత మూడు సంవత్సరాలుగా ఉపాధ్యాయ సంఘాలు చేస్తున్న పోరాటాల ఫలితంగా ఈనెల 27 నుంచి ప్రారంభమవుతున్న ఉపాధ్యాయుల బదిలీలు జీరో సర్వీసుతో చేపట్టాలన్నారు. ప్రచారంలో టీఎస్ యుటీఎఫ్ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, నాయకులు కృష్ణయ్య,వేణుగోపాల్, ఎల్లప్ప, కృష్ణ, రవి, విజయలక్ష్మీ, సునీత తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం చేపడుతున్న బదిలీల్లో కనీసం రెండేళ్ల స్టేషన్స్ సీనియార్టీ ఎత్తివేసి జీరో సర్వీస్ పెట్టాలని తపస్ జిల్లా అధ్యక్షుడు బొల్లం సునీల్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.